# أنا مسلم (للحرمين)

# నేను ఒక ముస్లింను

## నేను ఒక ముస్లింను

## మస్జిద్ అల్ హరామ్ మరియు మస్జిద్ అన్నబవీలలోని ధార్మిక పరమైన వ్యవహారాల విభాగానికి చెందిన శాస్త్రీయ కమిటీ.

నేను ఒక ముస్లింను, అంటే నా ధర్మం ఇస్లాం అని అర్థం,

మరియు 'ఇస్లాం' అనేది అత్యంత గొప్ప, పవిత్రమైన పదం; అందుకే మొట్టమొదటి ప్రవక్త నుండి చిట్టచివరి ప్రవక్త వరకు ప్రవక్తలందరూ (అలైహిస్సలాం) దీనిని పరంపరగా ఒకరి నుండి మరొకరు వారసత్వంగా స్వీకరించారు.

ఈ పదం ఉన్నతమైన భావాలను, మహోన్నతమైన విలువలను కలిగి ఉంది.

దీని అర్థం - సృష్టికర్తకు సమర్పించుకోవడం, విధేయత చూపడం, ఆయన ఆజ్ఞలను పాటించడం.

మరియు ఇవి వ్యక్తికి, సమాజానికి శాంతిని, సామరస్యాన్ని, సౌభాగ్యాన్ని, రక్షణను మరియు మానసిక ప్రశాంతతను అందిస్తాయి.

అందుకే ఇస్లామీయ షరిఅహ్ లో "సలాం" మరియు "ఇస్లాం" అనే పదాలు అత్యధికంగా కనిపించే పదాలలో ఉన్నాయి.

'అస్సలాము' అనునది అల్లాహ్ యొక్క దివ్యనామాలలోని ఒక దివ్యనామం.

మరియు ‘అస్సలాము అలైకుమ్’ (శాంతి శుభాలు) మాత్రమే ముస్లింలు తమ మధ్య పరస్పరం చేసుకునే అభివాదము.

స్వర్గవాసుల అభివాదం సలాం.

వాస్తవానికి ఎవరి నాలుక నుండి మరియు చేతి నుండి ఇతర ముస్లింలు భద్రంగా ఉంటారో, అతనే నిజమైన ముస్లిం.

కాబట్టి ఇస్లాం ప్రజలందరికీ మేలు కలిగించే ధర్మం. అది వారందరినీ తనలో ఇముడ్చుకుంటుంది; ఇహలోకంలోనూ పరలోకంలోనూ వారి సాఫల్యానికి అదే మార్గం.

అందుకే ఇది చిట్టచివరిదిగా, సంపూర్ణమైనదిగా, సమగ్రమైనదిగా, స్పష్టమైనదిగా మరియు అందరికీ అందుబాటులో ఉండేదిగా వచ్చింది. ఇది ఒక జాతికి మరొక జాతిపై గానీ, ఒక రంగుకు మరొక రంగుపై గానీ ఏ విధమైన వివక్ష చూపదు; పైగా ప్రజలందరినీ ఒకే దృష్టితో సమానంగా చూస్తుంది.

ఇస్లాంలో ఎవరూ (పుట్టుకతో, హోదాతో లేదా వేరే ఏదైనా కారణంతో) ప్రత్యేకంగా గొప్పవారైపోరు; ఎవరు దాని బోధనలను ఎంత ఎక్కువగా ఆచరిస్తే వారే అంత గొప్పవారవుతారు.

అందుకే సహజమైన, సక్రమమైన స్వభావం కలిగిన స్వచ్ఛమైన మనస్సులన్నీ దీనిని అంగీకరిస్తాయి; ఎందుకంటే ఇది మానవ సహజ స్వభావానికి (ఫిత్రత్‌కు) అనుగుణంగా ఉంటుంది.

ప్రతి మనిషీ మంచిని, న్యాయాన్ని, స్వేచ్ఛను ప్రేమించే నైజంతోనే జన్మిస్తాడు; తన ప్రభువును ప్రేమిస్తూ, ఆయన తప్ప

మరెవ్వరూ ఆరాధనకు అర్హులు కాదని, ఆయనే ఏకైక ఆరాధ్యుడని ఖచ్చితంగా అంగీకరిస్తాడు.

ఏ మనిషైనా ఈ సహజ స్వభావం నుండి దారి తప్పుతున్నాడంటే, దానిని మార్చివేసే ఏదో ఒక ప్రభావమే అందుకు కారణం.

ఈ ధర్మాన్నే సర్వమానవాళి సృష్టికర్త, వారి ప్రభువు, వారి ఏకైక ఆరాధ్యుడైన అల్లాహ్ ప్రజల కోసం సమ్మతించి, ఎంచుకున్నాడు.

నేను ఈ (తాత్కాలిక) ఇహలోకంలో జీవించిన తర్వాత, నా మరణంతో ఒక శాశ్వత పరలోకంలో అడుగుపెడతానని నా ధర్మమైన ఇస్లాం నాకు బోధిస్తోంది. ఆ శాశ్వత పరలోకంలో మానవుల అంతిమ గమ్యం, స్వర్గం లేదా నరకం అవుతుంది.

నా ధర్మమైన ఇస్లాం కొన్నింటిని చేయమని నన్ను ఆదేశిస్తూనే, నిషేధించబడిన మరికొన్నింటికి దూరంగా ఉండమని నన్ను వారిస్తున్నది.

నేను ఆ ఆదేశాలను పాటిస్తూ, నిషేధించబడిన వాటి నుండి దూరంగా ఉంటే, ఈ ఇహలోక జీవితంలోనూ మరియు పరలోకంలోనూ సౌభాగ్యాన్ని పొందుతాను.

వాటిని పాటించడంలో నేను నిర్లక్ష్యం వహిస్తే, నేను చేసే లోపాలు, నిర్లక్ష్యానికి తగినట్లుగా ఈ ఇహలోక జీవితంలోనూ, పరలోకంలోనూ దుఃఖాన్ని, దౌర్భాగ్యాన్ని అనుభవించవలసి వస్తుంది.

నా ధర్మమైన ఇస్లాం నన్ను ఆదేశించిన వాటన్నింటిలోకెల్లా అత్యంత ముఖ్యమైనది, ఘనమైనది 'తౌహీద్', అంటే అల్లాహ్‌ను మాత్రమే ఏకైక ఆరాధ్యుడిగా అంగీకరించడం.

నా సృష్టికర్త, నేను ఆరాధించవలసిన ఏకైక ఆరాధ్యుడు అల్లాహ్ మాత్రమేనని నేను పూర్తి నిశ్చయంతో విశ్వసిస్తూ సాక్ష్యమిస్తున్నాను.

కాబట్టి, నేను అల్లాహ్‌ను మాత్రమే ప్రేమిస్తూ, ఆయన శిక్షకు భయపడుతూ, ఆయన ప్రసాదించే ప్రతిఫలాన్ని ఆశిస్తూ, ఆయనపైనే పరిపూర్ణ నమ్మకం ఉంచుతూ ఆయనను మాత్రమే ఆరాధిస్తాను; మరెవ్వరినీ ఆరాధించను.

ఆ 'తౌహీద్' (ఏకత్వ భావన) అనేది అల్లాహ్ ఏకైకుడని, ఆయన ప్రవక్త ముహమ్మద్ ﷺ అల్లాహ్ సందేశహరుడని సాక్ష్యమివ్వడంలో వ్యక్తమవుతుంది.

ముహమ్మద్ ప్రవక్త ﷺ ప్రవక్తలందరిలో చిట్టచివరి ప్రవక్త. అల్లాహ్ ఆయనను సర్వలోకాల వారికి కారుణ్యంగా పంపాడు మరియు ఆయనతో ప్రవక్తత్వాన్ని, దివ్యసందేశాల పరంపరను ముగించాడు. కాబట్టి, ముమ్మాటికీ ఆయన తర్వాత ఇక ఏ ప్రవక్తా రాడు.

ఆయన ﷺ ప్రతి కాలానికీ, ప్రతి ప్రాంతానికీ, ప్రతి సమాజానికీ అనుకూలమైన, సార్వజనీనమైన (అందరికీ వర్తించే) ధర్మాన్ని తీసుకువచ్చారు.

నా ధర్మమైన ఇస్లాం, నన్ను దైవదూతలను మరియు ప్రవక్తలందరినీ, ముఖ్యంగా నూహ్, ఇబ్రాహీమ్, మూసా, ఈసా

(అలైహిముస్సలాం) మరియు మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)లను దృఢమైన విశ్వాసంతో విశ్వసించాలని ఆజ్ఞాపిస్తోంది.

మరియు ప్రవక్తలపై అవతరింపజేయబడిన దివ్యగ్రంథాలన్నింటినీ విశ్వసించాలని, అలాగే వాటన్నింటిలో చిట్టచివరిది, అత్యంత గొప్పదైన 'ఖుర్ఆన్ మజీద్'ను మాత్రమే అనుసరించాలని నా ధర్మం నన్ను ఆజ్ఞాపిస్తోంది.

మరియు ప్రజలందరికీ వారి పనులకు తగిన ప్రతిఫలాలు ఇవ్వబడే 'అంతిమ తీర్పుదినాన్ని' విశ్వసించాలని నా ధర్మం నన్ను ఆజ్ఞాపిస్తోంది.

మరియు విధివ్రాతను (ఖదర్'ను) విశ్వసించాలని, ఈ ప్రాపంచిక జీవితంలో నాకు ఎదురయ్యే మంచి, చెడు రెండింటి విషయంలోనూ ప్రశాంతంగా, సంతృప్తిగా ఉండాలని, అలాగే (నరకాగ్ని నుండి) రక్షించుకునే మార్గాలను అనుసరించడానికి ప్రయత్నించాలని నా ధర్మం నన్ను ఆజ్ఞాపిస్తోంది.

మరియు విధివ్రాతను (ఖదర్'ను) విశ్వసించడం నాకు మనశ్శాంతిని, ప్రశాంతతను, సహనాన్ని ప్రసాదిస్తుంది; అలాగే జరిగిపోయిన దాన్ని తలచుకుని బాధపడటం (విచారించడం) నుండి నన్ను వారిస్తుంది.

ఎందుకంటే, జరగాల్సింది నన్ను తప్పించిపోయేది కాదని, నాకు దక్కనిది నాకు ఎన్నటికీ సంభవించేది కాదని పరిపూర్ణ విశ్వాసంతో, పూర్తి నిశ్చయంతో నాకు తెలుసు.

ఎందుకంటే, ప్రతిదీ అల్లాహ్‌చే ముందే నిర్ణయించబడింది మరియు లిఖించబడింది; నా బాధ్యత కేవలం అందుకు దారితీసే మార్గాలను అనుసరించడం, ఆ తర్వాత జరిగేదాన్ని సంతృప్తితో మనస్ఫూర్తిగా స్వీకరించడమే.

మరియు నా ప్రభువును ప్రసన్నం చేసే, నా ఆత్మను శుద్ధి చేసే, నా హృదయానికి ఆనందాన్ని ఇచ్చే, నా మనసుకు ప్రశాంతతను కలిగించే, నా మార్గాన్ని ప్రకాశింపజేసే, నన్ను సమాజంలో ఒక ప్రయోజనకరమైన సభ్యుడిగా తీర్చిదిద్దే సత్కార్యాలను మరియు ఉన్నతమైన సద్గుణాలను ఆచరించమని ఇస్లాం నన్ను ఆజ్ఞాపిస్తోంది.

ఆ సత్కార్యాలన్నింటిలోకెల్లా అత్యంత ముఖ్యమైనవి: అల్లాహ్ ఏకత్వాన్ని (తౌహీద్ ను) విశ్వసించడం, ప్రతి రోజు మరియు రాత్రి కలిపి ఐదు పూటల నమాజులను క్రమం తప్పకుండా ఆచరించడం, సంపదకు సంబంధించిన జకాత్ దానం చెల్లించడం, సంవత్సరంలో ఒక నెల - అంటే రమదాన్ నెలలో - ఉపవాసాలు పాటించడం, మరియు స్థోమత ఉన్నవారు మక్కాలోని పవిత్ర కాబాగృహానికి హజ్జ్ యాత్ర చేయడం.

మనస్సుకు ఎంతో ప్రశాంతతను ప్రసాదించే విషయాలలో, నా ధర్మం నాకు మార్గనిర్దేశం చేసిన అత్యంత గొప్ప విషయం—దివ్య ఖుర్‌ఆన్‌ను ఎక్కువగా పఠించడం. అది స్వయంగా అల్లాహ్ వాక్కు; సత్యవచనాలన్నింటిలోకెల్లా అత్యంత సత్యమైనది, మాటలన్నింటిలోకెల్లా అత్యంత సుందరమైనది, అత్యంత గొప్పది,

అత్యంత మహిమాన్వితమైనది. అది పూర్వీకులు మరియు తరువాతి తరాలకు సంబంధించిన జ్ఞానాన్ని తనలో కలిగి ఉన్నది.

దానిని పఠించడం లేదా వినడం వల్ల హృదయంలో ప్రశాంతతను, మనశ్శాంతిని, ఆనందాన్ని నింపుతాయి - పఠించేవారు లేదా వినేవారు అరబీ భాష తెలియనివారైనా, ముస్లిమేతరులైనా సరే.

మరియు మనస్సుకు అపారమైన ప్రశాంతతను ప్రసాదించే కార్యాలలో అత్యంత గొప్పవి: అల్లాహ్‌నే నిరంతరం ప్రార్థించడం (దుఆ చేయడం), ఆయననే ఆశ్రయించడం, అలాగే చిన్నదైనా, పెద్దదైనా ప్రతి విషయాన్నీ ఆయననే వేడుకోవడం.

ఎందుకంటే, తనను మనస్ఫూర్తిగా ఆరాధిస్తూ, చిత్తశుద్ధితో తనకు మొరపెట్టుకునే ప్రతి ఒక్కరి ప్రార్థనకు అల్లాహ్ తప్పకుండా సమాధానమిస్తాడు.

మరియు మనస్సుకు అపారమైన శాంతిని ప్రసాదించే కార్యాలలో అత్యంత గొప్పది: సర్వోన్నతుడు, మహోన్నతుడైన అల్లాహ్‌ను ఎక్కువగా స్మరించడం (జిక్ర్ చేయడం).

మరియు నా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ ను ఏ విధంగా స్మరించాలో (జిక్ర్ చేయాలో) నాకు మార్గనిర్దేశం చేశారు; అలాగే అల్లాహ్ ను స్మరించడానికి అత్యుత్తమమైన విధానాన్ని కూడా నాకు నేర్పించారు.

అందులో ముఖ్యమైనవి: ఖుర్ఆన్ తర్వాత పలికే మాటలలోకెల్లా అత్యుత్తమమైన ఈ నాలుగు పదాలు:

(సుబ్హానల్లాహ్, అల్హమ్దులిల్లాహ్, లా ఇలాహ ఇల్లల్లాహ్, అల్లాహు అక్బర్).

అలాగే, (అస్తగ్ఫిరుల్లాహ్, లా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్) అని స్మరించడం.

అందువల్ల, ఈ పవిత్ర పదాలకు మనస్సుకు అపారమైన ప్రశాంతతను కలిగించడంలోనూ, హృదయంలోనికి దైవిక ప్రశాంతతను (సకీనహ్) నింపడంలోనూ ఒక అద్భుతమైన ప్రభావం ఉంది.

మరియు నా మానవత్వానికి, ఆత్మగౌరవానికి భంగం కలిగించే, వాటిని దిగజార్చే పనులకు దూరంగా ఉంటూ, ఉన్నతమైన గౌరవస్థాయిలో జీవించాలని ఇస్లాం నన్ను ఆజ్ఞాపిస్తోంది.

మరియు నా ధర్మానికి, ప్రాపంచిక జీవితానికి ప్రయోజనం చేకూర్చే కార్యాల కోసం—అంటే అవి ఏ లక్ష్యం కోసమైతే సృష్టించబడ్డాయో ఆ లక్ష్యం కోసమే—నా బుద్ధిని, నా శరీర అవయవాలను ఉపయోగించాలని ఇస్లాం నన్ను ఆజ్ఞాపిస్తోంది.

మరియు ఇస్లాం నన్ను దయతో మెలగాలని, సత్ప్రవర్తనను ప్రదర్శించాలని, మర్యాదగా వ్యవహరించాలని, అలాగే మాటల ద్వారా, చేతల ద్వారా నా శక్తి మేరకు సమస్త సృష్టి పట్ల మేలు చేయాలని ఆజ్ఞాపిస్తోంది.

మరియు సృష్టి పట్ల నేను నెరవేర్చవలసిన హక్కులలో అత్యంత గొప్పది తల్లిదండ్రుల హక్కు. నా ధర్మం నన్ను వారి పట్ల విధేయత కలిగి ఉండాలని, వారిని ఆదరించాలని, వారికి మంచి జరగాలని

కోరుకోవాలని, వారిని సంతోషపెట్టడానికి తాపత్రయపడాలని మరియు వారికి ప్రయోజనం చేకూర్చాలని—ముఖ్యంగా వారికి వృద్ధాప్యం వచ్చినప్పుడు—ఆజ్ఞాపిస్తోంది.

అందుకే ముస్లిం సమాజాలలో తల్లిదండ్రులు తమ పిల్లల నుండి అత్యున్నత గౌరవం, మర్యాద మరియు సేవలను పొందుతూ ఎంతో ఉన్నతమైన స్థానంలో ఉండడాన్ని మీరు చూడవచ్చు.

మరియు తల్లిదండ్రుల వయస్సు పైబడే కొద్దీ, లేదా వారు ఏదైనా అనారోగ్యానికి గురైనా, లేదా శారీరకంగా బలహీనపడినా, వారి పట్ల పిల్లలు చూపించే ప్రేమానురాగాలు, శ్రద్ధ, సేవ మరియు విధేయత మరింత పెరుగుతాయి.

మరియు స్త్రీకి ఉన్నతమైన గౌరవం, ఉన్నతమైన హక్కులు ఉన్నాయని నా ఇస్లాం ధర్మం నాకు నేర్పింది.

ఇస్లామీయ బోధనల ప్రకారం స్త్రీలు పురుషులకు సమాన భాగస్వాములు. అలాగే తన కుటుంబ సభ్యుల పట్ల అత్యంత ప్రేమగా, శ్రేష్ఠంగా వ్యవహరించే వ్యక్తే మానవులందరిలోకెల్లా ఉత్తముడు.

కాబట్టి, ముస్లిం బాలికకు తన బాల్యంలో పాలు తాగే (పోషణ పొందే) హక్కు, మంచి సంరక్షణ పొందే హక్కు మరియు శ్రేష్ఠమైన పెంపకం పొందే హక్కు ఉన్నాయి. ఆ సమయంలో ఆమె తన తల్లిదండ్రులకు మరియు సోదరులకు కంటికి చలువ లాంటిది, హృదయానికి ఆనంద స్వరూపం.

మరియు ఆమె వయస్సు పెరిగే కొద్దీ ఎంతో గౌరవించబడుతూ, ఆదరించబడుతూ ఉంటుంది; ఆమె సంరక్షకుడు ఆమె పట్ల ఆత్మీయమైన శ్రద్ధతో, గౌరవభావంతో ఉంటూ, తన సంపూర్ణ సంరక్షణలో ఆమెను కాపాడుతాడు.

ఎవరైనా ఆమెపై చెడు ఉద్దేశంతో చెయ్యి వేయడానికి చూసినా, ఆమెను మాటలతో నొప్పించినా, ఆమె వైపు వక్రబుద్ధితో చూసినా— ఆమె సంరక్షకుడు అస్సలు సహించడు.

ఆమె వివాహబంధంలోకి అడుగుపెట్టినప్పుడు, ఆ నికాహ్ బంధం అల్లాహ్ ఆదేశంతో, ఆయన నిర్దేశించిన గంభీరమైన మరియు బలమైన ఒడంబడిక ప్రకారమే ఏర్పడుతుంది.

వివాహానంతరం ఆమె తన భర్త ఇంట్లో ఎంతో ఆదరణతో, రక్షణతో, మహోన్నత గౌరవంతో జీవిస్తుంది.

ఆమెను ఎంతో గౌరవంగా చూసుకోవడం, ఆమె పట్ల ఆప్యాయతతో వ్యవహరించడం మరియు ఆమెకు ఎలాంటి కష్టం కానీ, బాధ కానీ కలగకుండా చూడడం ఆమె భర్త యొక్క ముఖ్యమైన బాధ్యత.

ఆమె తల్లి అయినప్పుడు, ఆమె పట్ల విధేయతగా, సత్ప్రవర్తనతో మెలగడం మహోన్నతుడైన అల్లాహ్ హక్కుతో జత చేయబడింది; ఆమెకు అవిధేయత చూపడం, ఆమె పట్ల దురుసుగా ప్రవర్తించడం అల్లాహ్ కు భాగస్వాములను కల్పించడంతో (షిర్క్ చేయడంతో), భూమిపై కల్లోలం, అవినీతి, అరాచకం సృష్టించడంతో జత చేయబడింది.

మరియు ఆమె 'సోదరి' అయినప్పుడు, ఆమెతో రక్తసంబంధాన్ని ఉత్తమంగా కొనసాగించాలని, ఆమెను ఆదరించాలని మరియు ఆమె గౌరవం, భద్రత పట్ల శ్రద్ధ వహించాలని ముస్లింలకు ఆదేశించబడింది.

ఆమె మేనత్త లేదా పిన్ని అయినప్పుడు ఆదరణ, విధేయత మరియు బంధుత్వాన్ని కొనసాగించడంలో ఆమె తల్లి స్థానంలో ఉంటుంది.

మరియు ఆమె 'అమ్మమ్మ/నానమ్మ' లేదా వయోవృద్ధురాలైనప్పుడు, ఆమె పిల్లలు, మనుమలు-మనుమరాళ్లు మరియు బంధువులందరి వద్ద ఆమె విలువ మరింత పెరుగుతుంది; ఆమె ఏది కోరినా దానిని సాధారణంగా ఎవ్వరూ తిరస్కరించరు, అలాగే ఆమె అభిప్రాయానికి అభ్యంతరం చెప్పరు.

మరియు ఆమె ఒక వ్యక్తికి ఎటువంటి బంధుత్వం లేదా పొరుగుబంధం లేని పరాయి (అపరిచిత) స్త్రీ అయినప్పటికీ, ఆమెకు ఎలాంటి హాని చేయకుండా ఉండడం, ఆమె వైపు చూసేటప్పుడు చూపులను నిగ్రహించుకోవడం (చూపులను క్రిందికి దించుకోవడం) వంటి సాధారణ ఇస్లామీయ హక్కులు ఆమెకు ఉన్నాయి.

ముస్లిం సమాజాలు ఇప్పటికీ ఈ హక్కులను ఎంతో శ్రద్ధతో, అత్యుత్తమమైన రీతిలో కాపాడుతూనే ఉన్నాయి; ఫలితంగా, ముస్లిమేతర సమాజాలలో స్త్రీకి లభించని విలువ, గౌరవప్రదమైన స్థానం ఇస్లామీయ సమాజంలో ఆమెకు లభిస్తోంది.

అంతేగాక, ఇస్లాంలో స్త్రీకి ఆస్తిపాస్తులను కలిగి ఉండే (యాజమాన్య) హక్కు, అద్దెకు ఇచ్చే/తీసుకునే హక్కు, క్రయవిక్రయాలు (అమ్మకాలు, కొనుగోళ్లు) జరిపే హక్కు మరియు ఇతర అన్ని రకాల ఒప్పందాలు చేసుకునే హక్కు ఉన్నాయి. అలాగే, తన ధర్మానికి (ఇస్లామీయ నియమాలకు) విరుద్ధం కానటువంటి పరిధుల్లో విద్యను అభ్యసించే, బోధించే మరియు ఉద్యోగం/ఉపాధి పొందే హక్కు కూడా ఆమెకు ఉంది.

నిజానికి, జ్ఞానంలో కొంత భాగాన్ని అభ్యసించడం స్త్రీ, పురుషులనే తేడా లేకుండా ప్రతి ఒక్కరిపై విధించబడిన వ్యక్తిగత బాధ్యత (ఫర్ద్-ఎ-ఐన్); దానిని వదిలివేసినవారు పాపానికి గురవుతారు.

నిజానికి, పురుషులకు ఉన్న హక్కులు స్త్రీలకు కూడా ఉన్నాయి; అయితే స్త్రీలకు మాత్రమే ప్రత్యేకమైనవి కొన్ని హక్కులు మరియు ధార్మిక నిబంధనలు ఉండగా, పురుషులకు మాత్రమే ప్రత్యేకమైనవి మరికొన్ని హక్కులు మరియు ధార్మిక నిబంధనలు ఉన్నాయి. అవి వారిలో ప్రతి ఒక్కరి స్వభావానికి, పరిస్థితులకు అనుగుణంగా ఉంటాయి. ఈ హక్కులు మరియు నిబంధనలు (ఇస్లామీయ గ్రంథాలలో) ఆయా సందర్భాలలో వివరంగా ప్రస్తావించబడ్డాయి.

నాకు తోడబుట్టిన సోదరసోదరీమణులను, స్వంత బంధువులైన బాబాయిలు, పినతండ్రులు, అత్తలు, మేనమామలు, పిన్నులు మరియు బంధువులందరినీ ఆప్యాయంగా ప్రేమించాలని నా ఇస్లామీయ ధర్మం నాకు బోధిస్తుంది. అంతేకాకుండా, నా భార్య, నా

పిల్లలు మరియు నా ఇరుగుపొరుగువారి హక్కులను నెరవేర్చాలని కూడా నా ధర్మం నన్ను ఆదేశిస్తుంది.

నా ధర్మం నన్ను జ్ఞానాన్ని అర్జించాలని శాసిస్తుంది. నా మేధస్సును, నైతిక ప్రవర్తనను మరియు ఆలోచనా పరిణతిని పెంపొందించే ప్రతి మంచి పనిని ఆచరించమని నన్ను ప్రోత్సహిస్తుంది.

అలాగే నా ఇస్లామీయ ధర్మం నన్ను సిగ్గుబిడియం (హయా), సహనం, ఉదారత, ధైర్యం, విచక్షణ (హిక్మత్), గంభీరత, ఓర్పు, విశ్వసనీయత (అమానత్), వినయం, పవిత్రత (ఇఫ్ఫత్), నీతి-నిజాయితీ, వాగ్దానపాలన, ప్రజల మేలు కోరడం, జీవనోపాధి కోసం కృషి చేయడం, నిరుపేదలపై జాలి చూపడం, రోగులను పరామర్శించడం, ఇచ్చిన మాటను నెరవేర్చడం, మధురంగా మాట్లాడడం, చిరునవ్వుతో ప్రజలను పలకరించడం మరియు నా శాయశక్తులా వారిని సంతోషపరచడానికి ప్రయాసపడడం వంటి ఉత్తమ గుణాలను పాటించాలని ఆదేశిస్తుంది.

వీటన్నింటికి భిన్నంగా, నా ఇస్లామీయ ధర్మం నన్ను అజ్ఞానం పట్ల హెచ్చరిస్తుంది. అలాగే అవిశ్వాసం (కుఫ్ర్), నాస్తికత్వం, అవిధేయత, అసభ్యకరమైన దుష్కార్యాలు, వ్యభిచారం, లైంగిక వికృత ప్రవర్తన, అహంకారం, అసూయ, ద్వేషం, ఇతరుల పట్ల చెడు అనుమానం, అపశకున భావన, దుఃఖం, అబద్ధం, నిరాశ, పిసినారితనం, సోమరితనం, పిరికితనం, పనిలేకుండా ఉండటం, కోపం, తొందరపాటు, మూర్ఖత్వం, ప్రజల పట్ల చెడుగా ప్రవర్తించడం, ప్రయోజనం లేని అధిక మాటలు మాట్లాడటం, రహస్యాలను

బయటపెట్టడం, నమ్మకద్రోహం, ఇచ్చిన మాటను తప్పడం, తల్లిదండ్రులకు అవిధేయత చూపడం, బంధుత్వ సంబంధాలను తెంచుకోవడం, పిల్లల పట్ల నిర్లక్ష్యం వహించడం, పొరుగువారికి మరియు సాధారణంగా సమస్త ప్రజలకు హాని కలిగించడం వంటి వాటిని నిషేధిస్తుంది.

అలాగే ఇస్లాం నన్ను మత్తు పానీయాలు (మద్యం) సేవించడం, మాదకద్రవ్యాలు (డ్రగ్స్) వాడడం, డబ్బుతో జూదం ఆడడం, దొంగతనం, మోసం, కుట్ర/వంచన, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, వారిపై గూఢచర్యం చేయడం మరియు వారి వ్యక్తిగత లోపాలను/గోప్యమైన విషయాలను వెతకడాన్ని కూడా నిషేధిస్తుంది.

నా ఇస్లామీయ ధర్మం సంపదలను పరిరక్షిస్తుంది. దీనివల్ల సమాజంలో శాంతి, భద్రతలు వ్యాపిస్తాయి. అందుకే ఇస్లాం నమ్మకద్రోహానికి విరుద్ధమైన నిజాయితీ, విశ్వసనీయత (అమానత్)ను పాటించమని ప్రోత్సహించింది; దానిని పాటించేవారిని ప్రశంసించింది; వారికి సుఖమయమైన జీవితం, పరలోకంలో స్వర్గప్రవేశం లభిస్తాయని వాగ్దానం చేసింది. అలాగే దొంగతనాన్ని నిషేధించి, దానికి పాల్పడేవారికి ఇహలోకంలోనూ, పరలోకంలోనూ శిక్ష ఉంటుందని హెచ్చరించింది.

నా ధర్మం మానవ ప్రాణాలకు సంపూర్ణ సంరక్షణను అందిస్తుంది. అందువల్ల అన్యాయంగా ఎవరి ప్రాణాన్నీ తీయకూడదని శాసించింది. కేవలం శారీరక దాడే కాకుండా, మాటల ద్వారా కూడా ఇతరులను గాయపరచకూడదని స్పష్టంగా నిషేధించింది.

అంతేకాకుండా, మనిషి తనకు తాను హాని తలపెట్టుకోవడాన్ని కూడా ఇస్లాం పూర్తిగా నిషేధించింది. కాబట్టి ఎవరూ తమ బుద్ధిని పాడుచేసుకోవడానికి, తమ ఆరోగ్యాన్ని నాశనం చేసుకోవడానికి లేదా తమ ప్రాణాలను తామే తీసుకోవడానికి (ఆత్మహత్యకు) ధర్మపరంగా ఎలాంటి అనుమతీ లేదు.

నా ఇస్లామీయ ధర్మం మనుషుల స్వేచ్ఛలను పరిరక్షిస్తూనే, వాటిని క్రమబద్ధీకరించి, నియంత్రణలో ఉంచుతుంది.

ఇస్లాంలో మనిషికి తన ఆలోచనల్లో, వ్యాపార లావాదేవీల్లో, ప్రయాణాల్లో సంపూర్ణ స్వేచ్ఛ ఉంది. తనకు కానీ, ఇతరులకు కానీ నష్టం కలిగించే ఏ నిషేధిత కార్యానికీ పాల్పడనంత వరకు, మంచి ఆహారం, పానీయాలు, దుస్తులు మరియు వినే విషయాలు వంటి జీవితంలో లభించే పవిత్రమైన సుఖసంతోషాలను అనుభవించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది.

నా ఇస్లామీయ ధర్మం వ్యక్తిగత స్వేచ్ఛను క్రమశిక్షణలో ఉంచుతుంది. ఎవరూ తమ స్వేచ్ఛను ఉపయోగించి ఇతరులపై అతిక్రమణ చేయకుండా నిరోధిస్తుంది. అలాగే మనిషి ఆస్తిపాస్తులను, ఆనందాన్ని, చివరకు అతని మానవతనే నాశనం చేసే చెడు వ్యసనాల్లో, నిషిద్ధమైన సుఖాల్లో అతను విచ్చలవిడిగా మునిగిపోవడానికి ఇస్లాం ఒప్పుకోదు.

ధర్మం లేదా వివేకం అనే అడ్డు అదుపులు లేకుండా, ప్రతి విషయంలోనూ తమకు తాము స్వేచ్ఛనిచ్చుకుని, తమ కోరికలన్నీ తీర్చుకునే వారి పరిస్థితిని ఒకసారి గమనిస్తే... వారు ఎంతటి

దుఃఖంలో, తీవ్రమైన మానసిక ఆవేదనలో బతుకుతున్నారో అర్థమవుతుంది. ఆ మానసిక ఆందోళన నుంచి బయటపడాలనే కోరికతో వారిలో కొందరు ఆత్మహత్యకు కూడా సిద్ధపడడం మీరు చూస్తారు.

నా ఇస్లామీయ ధర్మం నాకు అన్నపానీయాల విషయంలో, నిద్రించే తీరులో మరియు ఇతరులతో సంభాషించే విధానంలో అత్యున్నతమైన నైతిక మర్యాదలను, పద్ధతులను బోధిస్తుంది.

నా ఇస్లామీయ ధర్మం నాకు వ్యాపారంలో అంటే వస్తువులు అమ్మేటప్పుడు, కొనేటప్పుడు అలాగే నా హక్కులు లేదా బాకీలను తిరిగి పొందేటప్పుడు కూడా ఉదారంగా, మెతకగా ప్రవర్తించాలని బోధిస్తుంది.

నా ఇస్లామీయ ధర్మం ఇతర మతాల వారి పట్ల ఉదారంగా, సహనంతో ఉండాలని బోధిస్తుంది. నేను వారికి ఏమాత్రం అన్యాయం చేయను, వారిని బాధించను. బదులుగా, వారి పట్ల శ్రేయోభిలాషతో వ్యవహరిస్తూ, వారికి ఎల్లప్పుడూ మేలు జరగాలని కోరుకుంటాను.

ఇతర మతాల వారి పట్ల ముస్లింలు ప్రదర్శించిన ఉదారతకు, సహనానికి ముస్లింల చరిత్రే ప్రత్యక్ష సాక్షి. అంతటి గొప్ప సహనశీలతను వారి కంటే ముందు మరే ఇతర సమాజంలోనూ కనబడలేదు.

చరిత్రలో ముస్లింలు ఎన్నో విభిన్న మతాల ప్రజలతో కలసి నివసించారు. ఆ ప్రజలు ముస్లింల పాలనలోకి వచ్చినప్పుడు

కూడా, ముస్లింలు వారందరితో మానవుల మధ్య ఉండగల అత్యుత్తమమైన రీతిలో, ఆదర్శవంతమైన సత్ప్రవర్తనతో మెలిగారు.

మొత్తంగా చెప్పాలంటే... ఇస్లాం నాకు అత్యున్నతమైన నైతిక విలువలను, ఆదర్శవంతమైన నడువడికను, సూక్ష్మమైన శిష్టాచారాలను కూడా నేర్పింది. ఇవన్నీ నా జీవితాన్ని ప్రశాంతంగా, సుఖసంతోషాలతో పరిపూర్ణంగా జీవించడానికి దోహదపడతాయి.

అలాగే, నా ప్రశాంతతను భంగపరిచే చెడుల నుండి మరియు సామాజిక వ్యవస్థకు, మనిషి ప్రాణానికి, బుద్ధికి, ఆస్తిపాస్తులకు, ఆత్మగౌరవానికి లేదా పరువు-ప్రతిష్ఠలకు నష్టం కలిగించే ఎలాంటి చర్యల నుంచైనా ఇస్లాం నన్ను నిషేధిస్తుంది.

నేను ఈ బోధనలను ఎంతగా పాటిస్తే, నా సంతోషం అంతగా పెరుగుతుంది.

ఆ బోధనలను పాటించడంలో నేను ఎంత లోటు చేస్తే, ఎంత అలసత్వం వహిస్తే నా సంతోషం కూడా అంతే మేరకు తగ్గిపోతుంది.

అయితే, ఇంత చెప్పినంత మాత్రాన నా వల్ల ఎలాంటి పొరపాట్లూ జరగవని కాదు. మనిషిగా నా సహజ బలహీనతలను నా ధర్మం గుర్తిస్తుంది. అందుకే నా వల్ల తప్పులు, నిర్లక్ష్యాలు జరిగినప్పుడు, క్షమాపణ కోరుకోవడానికి, పశ్చాత్తాపంతో అల్లాహ్ వైపు మరలడానికి ఇస్లాం ధర్మం నాకు అవకాశం కల్పించింది. నిజమైన పశ్చాత్తాపం మన నిర్లక్ష్యాల వల్ల కలిగిన దుష్ప్రభావాలను తుడిచిపెట్టడమే కాకుండా, మన సృష్టికర్త వద్ద మన గౌరవాన్ని మరింత పెంచుతుంది.

ఇస్లామీయ విశ్వాసాలు (అఖీదా), నైతిక విలువలు (అఖ్'లాఖ్), జీవన మర్యాదలు (ఆదాబ్), సామాజిక లావాదేవీలు (మామిలాత్)... ఇలా ఇస్లామీయ ధర్మానికి చెందిన ప్రతి ఒక్క బోధనకు మూలాధారం పరిశుద్ధ ఖుర్ఆన్ గ్రంథం మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లమ్) వారి ప్రామాణిక ఆచరణ విధానం (సున్నత్).

చివరగా నేను నిష్కర్షగా, ఖచ్చితంగా చెప్పగలను: ప్రపంచంలో ఎక్కడ ఉన్నా సరే, ఏ వ్యక్తి అయినా నిష్పక్షపాతంగా, నిజాయితీతో ఇస్లాం అసలు రూపాన్ని పరిశీలిస్తే, అతడు దానిని స్వీకరించకుండా ఉండలేడు. అయితే విచారకరమైన విషయం ఏమిటంటే, ఇస్లాంపై జరిగే అబద్ధపు ప్రచారాలు మరియు దానిని సరిగ్గా పాటించని కొందరు ముస్లింల తప్పుడు ప్రవర్తన వల్ల ఈ ధర్మం గురించిన నిజమైన అవగాహన సమాజంలో వక్రీకరించబడుతున్నది.

ఇస్లాం యొక్క వాస్తవ రూపాన్ని ఎవరైనా నిష్పాక్షికంగా పరిశీలించినా, లేదా దాని నిబంధనలను సక్రమంగా పాటిస్తూ జీవిస్తున్న నిజమైన ముస్లింల జీవనశైలిని గమనించినా... ఈ ధర్మాన్ని స్వీకరించడంలో అతడు ఏమాత్రం సంకోచించడు.

ఇస్లాం ధర్మం మానవాళి సౌభాగ్యానికి, సమాజంలో ప్రశాంతత, శాంతిభద్రతలను పెంపొందించడానికి, న్యాయాన్ని మరియు సత్ప్రవర్తనను వ్యాప్తి చేయడానికి పిలుపునిస్తుందని అప్పుడు అతనికి తేటతెల్లమవుతుంది.

ఇస్లాంను అనుసరిస్తున్నామని చెప్పుకునే కొందరు వ్యక్తులు చేసే పొరపాట్లు లేదా అక్రమాలు — అవి చిన్నవైనా, పెద్దవైనా — వాటికి ఇస్లామీయ ధర్మాన్ని బాధ్యులను చేయడం లేదా వాటిని ఇస్లామీయ ధర్మానికి ముడిపెట్టి నిందించడం ఎంతమాత్రం సరికాదు. ఇస్లామీయ ధర్మానికి అటువంటి తప్పుడు పనులతో ఎలాంటి సంబంధమూ లేదు; అది వాటి నుండి పూర్తిగా పరిశుద్ధమైనది.

ఇస్లాం ధర్మం నుండి దారితప్పి, తప్పుడు పనులు చేసేవారు, ఆ తప్పులకు తమకు తామే బాధ్యులు అవుతారు. ఎందుకంటే ఇస్లాం వారిని అటువంటి తప్పుడు పనులు చేయమని ఎప్పుడూ ఆదేశించలేదు. పైగా, ఇస్లామీయ బోధనలకు విరుద్ధంగా నడుచుకోవద్దని, దారితప్పే ప్రవర్తనలకు దూరంగా ఉండాలని వారిని గట్టిగా హెచ్చరించింది.

అంతేకాకుండా, న్యాయబద్ధంగా ఆలోచిస్తే... ఇస్లాం ధర్మాన్ని సరిగ్గా పాటిస్తూ, అల్లాహ్ ఆజ్ఞలను తమ స్వంత జీవితాల్లోనూ, ఇతరుల విషయంలోనూ నిజాయితీగా ఆచరణలో పెట్టే వ్యక్తులను చూసి నిర్ణయానికి రావడం సరైన పద్ధతి. అటువంటి వారి ఆదర్శ జీవితాలను చూసినప్పుడు, ఈ ధర్మం పట్ల మరియు దీనిని అనుసరించే వారి పట్ల గుండెల్లో ఎనలేని గౌరవాభిమానాలు ఏర్పడతాయి.

ఇస్లాం ధర్మం మనిషి మార్గదర్శకత్వానికి, ఆత్మశుద్ధికి సంబంధించిన చిన్నదైనా, పెద్దదైనా ఏ విషయాన్నీ విస్మరించకుండా, ప్రతి మంచి పనినీ ప్రోత్సహించింది. అదే

సమయంలో, వ్యక్తికి లేదా సమాజానికి హాని కలిగించే ఏ దుర్గుణాన్నీ, హానికరమైన కార్యాన్నీ ఉపేక్షించకుండా తీవ్రంగా హెచ్చరించింది; అటువంటి చెడు మార్గాల్లోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేసింది.

అందుకే, ఇస్లాం మహత్యాన్ని గుర్తించి, దాని ధార్మిక ఆచారాలను శ్రద్ధగా పాటిస్తున్నవారే ఇహలోకంలో అత్యంత సంతోషంగా జీవిస్తున్నారు. వారు తమ మనస్సును సంస్కరించుకోవడంలో, మంచి స్వభావాలను పెంపొందించుకోవడంలో, మరియు మహోన్నతమైన నైతిక విలువలను అలవరచుకోవడంలో అత్యున్నత స్థాయిలో ఉంటారు. ఈ సత్యానికి సన్నిహితులైనా, దూరంగా ఉన్నవారైనా; ఇస్లాంతో ఏకీభవించేవారైనా, విభేదించేవారైనా — అందరూ సాక్ష్యమిస్తారు.

అలా కాకుండా, ధర్మాన్ని సరిగ్గా పాటించకుండా సన్మార్గం తప్పిన ముస్లింల పరిస్థితిని మాత్రమే చూసి ఇస్లాం గురించి ఒక అంచనాకు రావడం ఎంతమాత్రం న్యాయం కాదు; కేవలం వారి ప్రవర్తన ఆధారంగా ఇస్లాంను నిర్ణయించడం తీవ్రమైన అన్యాయమే.

## నేను ఒక ముస్లింను

మస్జిద్ అల్ హరామ్ మరియు మస్జిద్ అన్నబవీలలోని ధార్మిక పరమైన వ్యవహారాల విభాగానికి చెందిన శాస్త్రీయ కమిటీ.

# విషయసూచిక

నేను ఒక ముస్లింను ........................................................................ 2
మస్జిద్ అల్ హరామ్ మరియు మస్జిద్ అన్నబవీలలోని ధార్మిక పరమైన వ్యవహారాల విభాగానికి చెందిన శాస్త్రీయ కమిటీ. .............................. 2
నేను ఒక ముస్లింను ......................................................................21

te444v1.0 - 06/09/2026